5న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు, జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్‌పి ఛైర్‌పర్సన్ అధ్యక్షతన ఆగస్టు ఐదో తేదీ ఉదయం 10 గంటల నుండి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్‌పి ఒకటి నుండి ఏడో స్థాయీ సంఘ సమావేశాలు ఐదో తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహిస్తామని, అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుండి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. సమావేశాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తామని, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా సమావేశాలకు హాజరు కావాలని ఆయన కోరారు.

జోరు వర్షం.. స్తంభించిన జనజీవనం..!

జిల్లాలో 78.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

భద్రాచలం వద్ద 45 అడుగులకు చేరిన నీటిమట్టం - మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

పోలవరం ఎగువ కాపర్ డ్యామ్ వద్ద 32.800 మీటర్లకు చేరిన నీటిమట్టం

నాగిరెడ్డిగూడెం, ఎర్రకాలువ జలాశయాలకు పెద్దఎత్తున వరద నీరు

ఏజెన్సీలో పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజల గుండెల్లో గుబులు

ఆచంట మండలంలో నీటిలో తేలియాడుతున్న నాట్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో బుధవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో ఏజెన్సీ ప్రాంతంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కుండపోత వర్షంతో జనజీవనం ఎక్కడికక్కడే స్తంభించిపోయింది. ఉదయం నుంచి వర్షానికి ఇంటి నుంచి బయటికి వెళ్లే పరిస్థితి నెలకొంది. బుధవారం ఉదయానికి ఏలూరు జిల్లాలో సగటు వర్షపాతం 78.4 మిల్లీమీటర్లుగా నమోదైంది. ముసునూరు, ముదినేపల్లి, నూజివీడు, లింగపాలెం మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేని వర్షంతో ఏజెన్సీలో పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. కుక్కునూరు, వేలేరుపాడు, బుట్టాయగూడెం వంటి మండలాల్లో వాగులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో రాకపోకలు స్తంభించాయి. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ఎద్దువాగు, గుండేటి వాగు పొంగడంతో పలుచోట్ల కాజ్‌వేలపై నీరు చేరి రెండు మండలాల్లోనూ దాదాపు 46 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బుట్టాయగూడెం మండలంలోని కన్నాపురం నుంచి ఐటిడిఎకు వెళ్లేరోడ్డుపై వరదనీరు చేరడంతో జనం రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలో, ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరద ఉధృతి పెరుగుతోంది. బుధవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద నీటిమట్టం 45 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. గురువారం ఉదయానికి వరదనీరు 50 అడుగులకు చేరనున్నట్లు అంచనా వేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు ఎగువ కాపర్ డ్యామ్ వద్ద 32.800 మీటర్లకు నీటిమట్టం చేరింది. వరద ఉధృతి మరింత పెరిగే ప్రమాదం ఉన్నట్లు చెబుతున్నారు. ఏజెన్సీలో కురుస్తున్న వర్షాలకు చింతలపూడిలో నాగిరెడ్డిగూడెం ప్రాజెక్టుకు పెద్దఎత్తున వరద నీరు చేరుతోంది. ప్రస్తుతం నాగిరెడ్డిగూడెం జలాశయానికి రెండు వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా 25 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జంగారెడ్డిగూడెం వద్ద ఎర్రకాలువ జలాశయానికి నాలుగు వేల క్యూసెక్కుల నీరు వచ్చిపడుతోంది. ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో జిల్లాలో అత్యధికంగా ప్రయివేటు స్కూళ్లకు సెలవు ప్రకటించారు.

పోలవరం నిర్వాసితుల్లో ఆందోళన

గోదావరి వరద తగ్గినట్టే తగ్గి మళ్లీ విజృంభిస్తుండటంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పోలవరం నిర్వాసిత గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే రేపాకగొమ్ము, గొమ్ముగూడెం గ్రామస్తులను పునరావాస కాలనీలకు తరలించారు. గురువారానికి వరద ఉధృతి పెరిగితే మరికొన్ని గ్రామాలను ఖాళీ చేయించే అవకాశం ఉంది. ప్రస్తుతం భద్రాచలం వద్ద వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో 2022 తరహాలో వరదలు వచ్చే ప్రమాదం ఉన్నట్లు భావిస్తున్నారు. దీంతో రెండు మండలాల్లోని 107 గ్రామాల ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వరద ఉధృతి పెరుగుతుండటంతో అధికారులు ముందస్తు చర్యలకు సన్నద్ధమయ్యారు.

ఖరీఫ్ నాట్లకు ఆటంకం

ఎడతెరిపిలేని వర్షంతో ఖరీఫ్ నాట్లకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. వర్షాలకు పొలాల్లో నీరు పెరుగుతుండటంతో నాట్లు వేసేందుకు ఇబ్బందులు నెలకొంటున్నాయి. దీంతో బుధవారం రైతులు నాట్లు నాటని పరిస్థితి ఉంది. ముఖ్యంగా డెల్టాలో ఇంకా పెద్దఎత్తున వరినాట్లు వేయాల్సి ఉంది. వర్షంతో నాట్లు మరింత ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది.

ఆచంట మండలంలో వరద గోదావరి

మళ్లీ గోదావరి ఉరకలు

ఆందోళనలో లంక గ్రామాల ప్రజలు - మళ్లీ మునిగిన కనకాయలంక కాజ్‌వే

యలమంచిలి మండలంలో గోదావరి ఉధృతి


నరసాపురంలో ఏటిగట్టును పరిశీలిస్తున్న ముదునూరి ప్రసాదరాజు

ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, డిఎస్‌పి

ప్రజాశక్తి - ఆచంట

ఎగువ నుంచి భారీగా వరద నీరు రావడంతో గోదావరి ఉధృతంగా ప్రవేశిస్తోంది. కొద్ది రోజులుగా వశిష్ట గోదావరికి వరద దోబూచులాడుతోంది. పెరుగుతూ.. తగ్గుతూ అటు అధికార యంత్రాంగాన్ని, ఇటు లంక గ్రామాల ప్రజలను కలవర పెడుతోంది. రెండు రోజులుగా గోదావరి తగ్గుముఖం పట్టడంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్న నేపథ్యంలో బుధవారం ఉదయం నుంచి వశిష్టగోదావరి కోడేరు వద్ద మళ్లీ పెరుగుతోంది. ప్రస్తుతం కోడేరు పుష్కర ఘాట్ వద్ద మెట్లు నీట మునిగాయి. దీంతో రెండు అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. వరద నేపథ్యంలో లంక గ్రామాలకు పడవలపై రాకపోకల నిషేధం ఇంకా కొనసాగుతోంది. కరుగోరుమిల్లి పుష్కరఘాట్ పూర్తిగా నీట మునిగింది. వరద ఉధృతి ఇదేవిధంగా కొనసాగితే లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు ప్రవేశించే అవకాశం ఉంది. వరద ఉధృతికి భీమలాపురంలో ఏటిగట్టు దిగువన ఉన్న సుమారు వంద కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. తహశీల్దార్ ఎంవి.సుబ్రహ్మణ్యం, ఆయా గ్రామ రెవెన్యూ అధికారులు, ఎస్ఐ రాజకుమార్ వరద పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

యలమంచిలి: మండలంలో గోదావరి వరద మళ్లీ పెరిగింది. మంగళవారం గోదావరి తగ్గుముఖం పట్టడంతో సాయంత్రానికి కనకాయలంక కాజ్‌వేపై ప్రజలు నడుచుకుంటూ రాకపోకలు సాగించే పరిస్థితి ఏర్పడటంతో అంతా సంతోషించారు. అయితే తెల్లారేసరికి పరిస్థితి తారుమారైంది. ఎగువ ప్రాంతాలనుండి వరద నీరు గోదావరిలోకి భారీగా చేరడంతో కాజ్‌వే మళ్లీ నీట మునిగింది. దీంతో కనకాయలంక ప్రజలు మళ్లీ పడవలపైనే ఆధారపడాల్సి వస్తోంది. గోదావరి ఉధృతి మరింత పెరిగితే పరివాహక గ్రామాలైన పెదలంక, బాడవ, యలమంచిలిలంక, లక్ష్మీపాలెం, గంగడపాలెం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల, బూరుగుపల్లి, కంచుస్తంభంపాలెం గ్రామాలకూ వరద ముప్పు పొంచి ఉంది. కనకాయలంకలో ప్రజల రాకపోకలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇంజిన్ పడవలు సరిపోవడం లేదని, మరో రెండు పడవలను పెంచాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నరసాపురంలో గోదావరి గట్టును పరిశీలించిన ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి

నరసాపురం టౌన్: పట్టణంలోని గోదావరి పరివాహక ప్రాంతాలు, పొన్నపల్లి ఏటిగట్టు పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు మోటార్ల సహాయంతో బయటకు మళ్లించాలన్నారు. స్థానికంగా నివాసముంటున్న ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఉండాలని అన్నారు. అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి వార్డులో పూర్తిస్థాయిలో శానిటేషన్ జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ జయరాజు, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, రెడ్డప్ప ధవేజి, మల్లాడి బుజ్జి, శేఖర్, జాన్‌కుమార్, ప్రజాప్రతినిధులు, నాయకులు, సిబ్బంది ఉన్నారు.

ముంపు ప్రాంతాల్లో సబ్ కలెక్టర్, డిఎస్‌పి పర్యటన

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా ముంపు ప్రాంతాలైన నవరసపురం ఎస్‌టి కాలనీని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, డిఎస్‌పి మనోహరాచారి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని రెవెన్యూ, పోలీస్ అధికారులకు సూచించారు. వారి వెంట తహశీల్దార్ ఎంఎస్.ఫాజిల్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మణిపూర్‌పై ప్రధాని మౌనం దారుణం

మారణహోమంపై కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - భీమవరం

మణిపూర్ మారణహోమంపై ప్రధాని నోరు మెదకపోవడం దారుణమని, దేశాన్ని పాలించే హక్కు మోడీకి లేదని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ అన్నారు. ఐద్వా ఆధ్వర్యాన పట్టణంలో నిరసన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ మణిపూర్ ఘటన జరిగి 79 రోజులైనా ప్రధాని నోరు మెదపకపోవడం దారుణమన్నారు. బేటి బచావో.. బేటి పడావో అని నినదించే ప్రధానికి మణిపూర్‌లో మహిళలపై సాగుతున్న అకృత్యాలు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. జిల్లా కోశాధికారి ఎస్.జయప్రభ మాట్లాడుతూ మణిపూర్ మారణహోమానికి కేంద్రంలోని, ఆ రాష్ట్రంలోను అధికారంలో ఉన్న బిజెపి పాలకులే కారణమని విమర్శించారు. తక్షణం రెండు ప్రభుత్వాలు గద్దె దిగి యావత్ జాతికి క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ సరోజిని, మహిళలు పాల్గొన్నారు.

భీమవరంలో ఐద్వా ఆధ్వర్యాన..

పోడూరు మండలంలో అంగన్వాడీలు

భీమవరం రూరల్: మణిపూర్‌లో మారణహోమంపై ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లంక కృష్ణమూర్తి, భీమవరం డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యాన స్థానిక అంబేద్కర్ సెంటర్లో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతిభద్రతల పరిరక్షణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తక్షణం మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని కోరారు. కార్యక్రమంలో కనుమూరి వెంకటపతిరాజు, దుగ్గిరాల శ్రీనివాస్, మోకా పరమేశ్వరరావు, వాటాల రాంబాబు, తిరమాని వనంరాజు పాల్గొన్నారు.

పోడూరు: మణిపూర్‌లో మహిళలపై అకృత్యాలకు పాల్పడుతున్న అల్లరి మూకలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గుమ్ములూరు మెయిన్ అంగన్వాడీ కేంద్రం పరిధిలో బుధవారం అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు లీడర్ పీతల రాజమణి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై సాగుతున్న మారణకాండను తక్షణం అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఎం.అమ్మాజీ, ఐ.బేబీ, జి.మంగతాయారు, పి.విమల, సిహెచ్.రత్నకుమారి, నాగమణి, కృష్ణవేణి, మణి, పుష్పలత, కె.సువర్ణ పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో పనులు చేయించండి

కలెక్టర్‌కు మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు విజ్ఞప్తి

ప్రజాశక్తి - భీమవరం

మండలంలోని సరిపల్లిలో హిందూ శ్మశానవాటిక ఆధునికీకరణ, రామాలయం రోడ్డులో డ్రెయినేజీ నిర్మాణానికి ఎంపీ రఘురామకృష్ణంరాజు మంజూరు చేసిన రూ.15 లక్షలు వినియోగించకుండా ఎంఎల్ఎ అడ్డుపడటం దారుణమని, ఆ నిధులతో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు జిల్లా కలెక్టర్ ప్రశాంతిని కోరారు. బుధవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన కలెక్టర్‌ను కలిసి సమస్య వివరించారు. ఎంపీ రఘురామకృష్ణంరాజు గతంలో వేములదీవికి రూ.44 లక్షలు, మల్లవరానికి రూ.5 లక్షలు, మొగల్తూరుకి రూ.10 లక్షలు, ముత్యాలపల్లికి రూ.12 లక్షలు, మొత్తం రూ.76 లక్షలు నిధులు కేటాయించినా ఎంఎల్ఎ వ్యక్తిగత, రాజకీయ దురుద్దేశంతో పనులు జరగకుండా అడ్డు పడ్డారని ఆరోపించారు. దీంతో ఆ నిధులు వెనక్కెళ్లిపోయాయన్నారు. కనీసం సరిపల్లికి కేటాయించిన నిధులైనా వినియోగించి పనులు జరిగేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఎంపీ నిధులు వినియోగించని పరిస్థితి నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోనే ఉందని విమర్శించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ పూర్తి వివరాలు తెలుసుకుని ఆ పనులు జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఎర్రకాలువ జలాశయానికి 4600 క్యూసెక్కుల వరదనీరు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని కొంగువారిగూడెం కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయానికి వరద నీరు అధికంగా వచ్చి చేరుతుందని జలవనరుల శాఖ ఎఇ సిహెచ్.భాస్కరరావు తెలిపారు. బుధవారం గంటకు 4602 క్యూసెక్కుల వరద నీరు జలాశయంలో వచ్చి చేరుతోందని తెలిపారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 80.00 మీటర్లకు వరద నీరు చేరుకుందన్నారు. విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల గురువారం ఉదయానికి అధికంగా వరద నీరు వచ్చి చేరితే జలాశయం గేట్లు ఎత్తివేసే అవకాశం ఉందని తెలిపారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

విద్య ద్వారానే ఆర్థిక అభివృద్ధి సాధ్యం - జిల్లా కలెక్టర్ ప్రశాంతి

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

పాఠశాలలు, కళాశాలల్లో చేరి చదువుకోవడానికి వీలుకాని వారిని మాత్రమే ప్రత్యేక పరిస్థితుల్లో ఓపెన్ స్కూల్ విద్యకు ప్రోత్స హించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదే శించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఓపెన్ స్కూల్స్ అడ్మిషన్లపై కలెక్టర్ ప్రశాంతి సంబంధిత శాఖల అధికారుల తో సమీక్షించారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని అన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో చేరి చదువుకోవడానికి వీలుపడని 18 సంవత్సరాల్లోపు ప్రతిఒక్కరూ కచ్చితంగా ఓపెన్ స్కూల్ ద్వారా విద్య అభ్యసించాలన్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రవేశానికి 755 మంది అడ్మిషన్లు తీసుకోగా, ఈ ఏడాది 831 అడ్మిషన్లు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. గతేడాది ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి 2,119 మంది అడ్మిషన్లు తీసుకోగా ఈ ఏడాది 2,331 అడ్మిషన్లు లక్ష్యంగా నిర్ణయించినట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్ఎస్‌సి, ఇంటర్ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. ఈ నెల 27 నుండి ఆగస్టు 31 వరకు ఓపెన్ స్కూల్లో చేరేవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

దఫదఫాలుగా వివిధ కార్యక్రమాల నిర్వహణ

ఈ నెల 28న జిల్లాలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియపై ఓరియంటేషన్ ప్రోగ్రామ్, ర్యాలీ నిర్వహిస్తారని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఈ నెల 28 నుండి ఆగస్టు 5వ తేదీ వరకు ప్రవేశాలకు సంబంధించి జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో, అధ్యయన కేంద్రాల నిర్వాహకులతో విస్తృత అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెల 31న వయోజన విద్య ప్రేరక్‌లు, గ్రామ, వార్డు సచివాలయాల సూపర్‌వైజర్స్, ఎస్ఎస్ఎ సెక్టోరియల్, విద్యాశాఖ అధికారులతో అవగాహన కార్యక్రమాలు, ఆగస్టు 1న స్వయం సహాయక బృందాలు, మహిళా, డ్వాక్రా గ్రూపులు, అంగన్‌వాడీ వర్కర్స్, మహిళా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎఎస్‌పి ఎవి.సుబ్బరాజు, డిఇఒ ఆర్.వెంకటరమణ, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, ఓపెన్ స్కూల్స్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఇ.నారాయణ, జిల్లా స్త్రీ శిశుసంక్షేమ అధికారి బి.సుజాతరాణి, డివిఇఒ కెవి.సత్యనారాయణ, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, డిపిఒ మల్లికార్జునరావు, డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు, డ్వామా పీడీ రాజేశ్వరరావు, కార్మిక శాఖ అధికారి పాల్గొన్నారు.

అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

భారీ వర్షాలు, గోదావరి వరద నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లాలోని మండల, ప్రత్యేకాధికారులతో మండలాల వారీగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. భారీవర్షాలు, గోదావరి వరద పరిస్థితులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అధికారులకు సూచనలు అందించి మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. లంక గ్రామాల్లో నివశిస్తున్న గర్భిణులకు ఎవరికైనా ప్రసవ తేదీ దగ్గర పడితే స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. మత్స్యకారులను వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, ఎవరైనా వేటకెళ్లి ఉంటే వారిని వెనక్కి రావాలని సమాచారం అందించాలన్నారు. ఎవ్వరినీ వేటకు వెళ్లనీయకుండా గోదావరి పరివాహక ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పడవలు, వలలు భద్రపర్చే విధంగా చర్యలు తీసుకోవడంతోపాటు, మత్స్యకారుల మత్స్య సంపదను మార్కెట్‌కు తరలించి అమ్మకమయ్యేలా చూడాలని మత్స్య శాఖాధికారులను ఆదేశించారు. గోదావరి ఏటిగట్లను నిరంతరం పర్యవేక్షించాలని, బలహీనంగా ఉంటే యుద్ధ ప్రాదిపదికన పటిష్టపర్చే చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక బస్తాలు సిద్ధం చేసుకుని పాయింట్లువారీగా నిల్వలు పెట్టుకోవాలని, ఇసుక కొరత తదితర ఇబ్బందులు ఉంటే వెంటనే సమాచారం అందించాలని అన్నారు. ఎటువంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ప్రయివేటు, ప్రభుత్వ భవనాలు గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలన్నారు. నాడు-నేడు పాఠశాలల్లో సెప్టిక్ ట్యాంకులు, గుంతలు, గొయ్యిలు ఉన్నచోట్ల ప్రమాదాలు జరగకుండా రెడ్ రిబ్బన్లు, హెచ్చరిక బోర్డులు పెట్టాలని సూచించారు. గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో నదీ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండటంతోపాటు, పశువులు, గొర్రెలు, మేకలను మేతకు తీసుకెళ్లరాదని సూచించారు. ముంపు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో అన్ని రకాల మందులతోపాటు పాముకాటు విరుగుడు మందును అందుబాటులో ఉంచాలన్నారు. వాటర్ ప్యాకెట్లు, జనరేటర్లు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, జెడ్‌పి సిఇఒ కెవిఎస్ఆర్.రవికుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బలరాం

పేదలకు కాళీపట్నం భూములపై హక్కు కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - మొగల్తూరు

కాళీపట్నం భూములను సాగు చేసుకుంటున్న పేదలకు శాశ్వత భూహక్కు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సాగులో ఉన్న భూములను భూమిలేని పేదలకు, దళితులకు, బిసిలకు ఇచ్చి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కాళీపట్నంలో ఐదు వేల ఎకరాల భూమి ఉందని, ఆ భూమిని పేదలకు పంచాలని నాడే కమ్యూనిస్టు పార్టీలు పోరాడాయని గుర్తు చేశారు. ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా ఎన్నటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. భూముల సర్వే నిర్వహించి పేదలకు పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, నేతలు యడ్ల చిట్టిబాబు, కొత్తపల్లి నాగరాజు, వీర పాండురంగారావు, మువ్వల రాజారావు, కొత్త విజయ్ కుమార్ పాల్గొన్నారు.

యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నియోజకవర్గంలో 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ వై.దుర్గాకిషోర్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 21వ తేదీ వరకూ ఓటరుగా నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపు ప్రక్రియ జరుగుతోందన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

భీమవరం రూరల్ : యువత తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని డిఎన్ఆర్ కళాశాల ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగరాజు అన్నారు. బుధవారం శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగం ప్రచార భేరి కార్యక్రమాన్ని డిఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యావంతులే ఓటు హక్కు వినియోగంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రిన్సిపల్ ఎం.అంజన్ కుమార్ ఓటు హక్కు నమోదు ప్రతి పౌరుడి నైతిక బాధ్యత అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వర్మ, లైబ్రేరియన్ కె.శిరీష, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ వి.ప్రవీణ్, ప్రసన్న విద్యార్థులు పాల్గొన్నారు.

28,722 మందికి ధ్రువపత్రాలు అందజేత

ప్రజాశక్తి - వీరవాసరం

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా వివిధ సచివాలయాల పరిధిలో మొత్తం 28,722 ధ్రువపత్రాలు అందజేశామని ఎంపిడిఒ జ్యోతి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. మొత్తం 34 సర్వీసులకు సంబంధించి ఈ ధ్రువపత్రాలను ప్రజలకు అందజేశామని తెలిపారు. అత్యధికంగా వీరవాసరం సచివాలయం-1లో 3,699, అత్యల్పంగా మడుగుపోలవరం సచివాలయంలో 443 ధ్రువపత్రాలు అందజేశామన్నారు. వాటిలో ఇన్‌కం, ఇంటిగ్రేటెడ్, 1బి ధ్రువపత్రాలు అధికంగా అందజేశామన్నారు.

కచ్చా డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గ్రామాల్లో కచ్చా డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వెంప గ్రామంలోని కొత్తపేటలో ఇంజేటి శ్రీనివాస్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల వల్ల రోడ్లపై నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కచ్చా డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

మృతుని కుటుంబానికి జనసేన సాయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జన సైనికులకు ఎటువంటి ఆపద వచ్చిన తాము అండగా ఉంటామని జనసేన తాడేపల్లిగూడెం నియోజకవర్గ కన్వీనర్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఇటీవల పత్తిపాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగిన శ్యామ్‌శేఖర్ సూర్యనారాయణ కుటుంబాన్ని బుధవారం బొలిశెట్టి పరామర్శించారు. అనంతరం ఆ కుటుంబానికి బొలిశెట్టి, జనసైనికులు కలిపి రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ మృతుని కుటుంబానికి జనసేన అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసైనికులు లింగం శ్రీను, పాలూరి భూరయ్య, పాలూరి బంగర్రాజు, ఆకుల రామకృష్ణ, పాలూరి సందీప్ పాల్గొన్నారు.

'సిపిఐ బలోపేతానికి కృషి చేయాలి'

ప్రజాశక్తి - ఉండి

దేశ ప్రజల కోసం ప్రాణ త్యాగం చేసిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. బుధవారం పాందువ్వలో పలువురు సిపిఐ సభ్యత్వం తీసుకున్నారు. నూతనంగా పార్టీలో చేరిన వారిని కోనాల భీమారావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన పాందువ్వలో నూతనంగా సిపిఐ సభ్యత్వం పొందిన బద్దా రమేష్ ఇంటి వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగం, ప్రజలెదుర్కొంటున్న సమస్యల పరిష్కార సాధన దిశగా ఉద్యమించి, సిపిఐ బలోపేతానికి కృషి చేయాలని భీమారావు కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - నరసాపురంటౌన్

నరసాపురం గోదావరి వరద ప్రవాహక ప్రాంతంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎస్ఎం.ఫాజిల్ సూచించారు. వరద ఉధృతి ఎక్కువగా ఉండడం వల్ల ప్రజలెవరూ గోదావరి ఒడ్డున ఉండడం గానీ, గోదావరిలో దిగం గాని చేయవద్దని సూచించారు. ప్రభుత్వ యంత్రాంగం గోదావరి నది ప్రవాహక ప్రాంతంలో పర్యటిస్తున్నారని, ఎటువంటి ఇబ్బందులున్నా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. అధిక వర్షాలు, గోదావరి వరదల కారణంగా మత్స్యకారులెవరూ వేటకు వెళ్లరాదు అని, అలాగే బియ్యపుతిప్ప గ్రామస్తులు నాటు పడవలపై ప్రయాణించ రాదని, నరసాపురంలోని వలంధర రేవు, పంటు రేవు, మిగిలిన రేవుల్లో దిగరాదని తెలిపారు.

జాగ్రత్తలు తీసుకోవాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - పెనుగొండ

అధిక వర్షాల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ ఎస్ఎన్‌వివి.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాలకు తడిసిన విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదని, విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను ముట్టుకోరాదని పేర్కొన్నారు. గాలి, దుమారం, వర్షం వచ్చినపుడు చెట్ల కింద నిలువరాదని, తెగిన విద్యుత్ వైర్లను ముట్టుకోరాదని తెలిపారు. సర్వీస్ వైర్ ఏమైన డ్యామేజ్ అయితే సంబంధిత విద్యుత్తు అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

డాబాపైకి ఎక్కిన ఆవు

3 గంటలు శ్రమించి కిందకు దించిన స్థానికులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో కోర్టు సమీపంలో బుధవారం భారీ వర్షానికి ఓ ఆవు కంప్యూటర్ బిల్డింగ్‌పైకి మెట్ల గుండా ఎక్కింది. అయితే తిరిగి రాలేకపోవడంతో స్వచ్ఛంద సంస్థకు చెందిన ప్రతినిధులు ఆవును కిందకు దింపడానికి తీవ్ర కృషి చేశారు. చివరకు ఏనిమల్ వారియర్ ముఖేష్ గౌడ్ సహాయంతో 3 గంటలు శ్రమించి ఆవును కిందకు దింపారు.

భవనంపైకి ఎక్కిన ఆవు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఆకివీడులో చెరువును తలపిస్తున్న జగనన్న కాలనీ

పాలకొల్లులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మడుగులా మారిన వెంప- మొగల్తూరు రోడ్డు

ఎడతెరిపిలేని వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం

ప్రజాశక్తి - ఆచంట

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మండలంలో బుధవారం ఎడతెరిపిలేకుండా వర్షం పడింది. దీంతో పలు కాలనీలు, పల్లపు ప్రాంతాలు, పంట పొలాలు నీటమునిగాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి ఆచంట, ఆచంట వేమవరం, పెనుమంచిలి, భీమలాపురం, కరుగోరుమిల్లి, కొడమంచిలి పంచాయతీ పరిధిలోని కాలనీలు ముంపు బారిన పడ్డాయి. ముఖ్యంగా కొడమంచిలి పంచాయతీ పరిధి టి.మెరక, చిన్నపేట, వల్లూరు పంచాయతీ పరిధి ఇందిరమ్మ కాలనీ, గెద్దాడవారిపాలెం, ఆచంట వేమవరం పంచాయతీ పరిధి పెద్దపేట, హరిజన పేట, కరుగోరు మిల్లి, పంచాయతీ పరిధి అంబేద్కర్ కాలనీ, పంచాయతీ కాలనీ, తదితర కాలనీలో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. దీనికితోడు రోడ్లు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉండి గోరింతోటలో నీటమునిగిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణ

ముంపు లోనే పంట పొలాలు..

మండలంలోని ఆచంట, ఆచంట వేమవరం, కొడమంచిలి, కోడేరు, కందరవల్లి, కరుగోరుమిల్లి, పెనుమంచిలి, వల్లూరు శేషమ్మ చెరువు, తదితర గ్రామాల్లో ముందుగా నాట్లు పడిన వరిచేలు పూర్తిగా నీట మునిగాయి. నారుమడులు కూడా నీటిలోనే కొనసాగుతున్నాయి. ముంపు బారిన పడిన పంట పొలాలను ఎఇఒ నాగరాజు పరిశీలించారు.

పెనుగొండ : బుధవారం మండలంలో ఎడతెరిపి లేని వర్షం పడింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మొగల్తూరు : బుధవారం ఉదయం నుంచి సాయంకాలం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. వ్యవసాయం ఇతర పనులకు వెళ్లే కార్మికులు ఉపాధి కోల్పోయారు. మొగల్తూరు – వెంప, పేరుపాలెం – కెపిపాలెం, కాళీపట్నం – భీమవరం, ముత్యాలపల్లి – పేరుపాలెం, వాలతిప్ప – వెంప తదితర రహదారులు ధ్వంసమయ్యాయి. గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

పోడూరు : మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెనుమదం, పోడూరు, కవిటం, గుమ్మలూరు, పండితవిల్లూరు గ్రామాల్లోని కాలనీ జలమయం అయ్యాయి. బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. కాలనీలు పూర్తిగా జలమయం అయ్యాయి. శివారు ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేక పోవడంతో రోడ్లపై వర్షపు నిలిచిపోయి ప్రజలు నానా అవస్థలు పడ్డారు.

పాలకొల్లు రూరల్ : కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. రోడ్లు బురదమయం అయ్యాయి. రోజువారీ కూలి పనుల నిమిత్తం వెళ్లేవారు నానా అవస్థలు పడుతున్నారు. వీధి వ్యాపారులు వ్యాపారం లేక ఏమి చేయలేని స్థితిలో ఉన్నారు.

నిండా మునిగిన జగనన్న కాలనీ

ఆకివీడు : జగనన్న కాలనీ మొత్తం నీటిమయంగా మారింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కాలనీలో సుమారు రెండు అడుగుల నుంచి నాలుగు అడుగుల మేర వర్షపు నీరు నిలిచిపోయింది. రెండు రోజులుగా జగనన్న కాలనీవాసులు నీళ్లల్లో నానుతున్నారు

ఉండి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు రహదారులు, సిమెంటు రోడ్లు జలమయమయ్యాయి. డ్రెయినేజీలోని మురుగునీరు రోడ్లపైకి వచ్చి దుర్గంధం వెదజల్లుతోంది. ఉండి గోరింతోటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణ మొత్తం వర్షం నీటితో నిండిపోయి తరగతి గదిలోకి నీరు ప్రవేశించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని కాంతమ్మ మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు పాఠశాలలోకి చేరుతోందని, సమస్యను ఉన్నతాధికారులకు, నాయకులకు తెలిపామని తెలిపారు.

పాలకొల్లు: పాలకొల్లులో బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. కనీసం ప్రజలు పాల ప్యాకెట్లు తెచ్చుకోవడానికి వీల్లేకుండా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని డ్రెయిన్లు, రోడ్లు ఏకమై మురుగు ప్రవహిస్తోంది. దీంతో మురుగులోనే ప్రజలు కనీస అవసరాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి. బస్టాండ్ ఆవరణ అంతా వర్షపు నీటితో నిండిపోయింది.

ఆచంటలో తాడేరు డ్రెయిన్

31న కాకినాడలో ఆక్వా రైతులతో సమావేశం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 31న కాకినాడలో ఆక్వా రైతులు, ప్రోసెసింగ్ యూనిట్లు, హేచరీస్ మధ్య ఉమ్మడి సమావేశం నిర్వహిస్తున్నట్లు జై భారత్ క్షీరారామ ఆక్వారైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు చెప్పారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. ఆక్వా రైతులు ఇటీవల పాలకొల్లులో జరిగిన సమావేశం అనంతరం రాష్ట్ర ఆక్వా నేతలు తమతో సమావేశం ఏర్పాటు చేయడం మంచి పరిణామం అన్నారు. దీని ఫలితమే కాకినాడ సమావేశం జరుగుతోందని చెప్పారు. రైతులకు నష్టం లేకుండా సమావేశంలో మంచి నిర్ణయం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాన కార్యదర్శి బోనం చినబాబు మాట్లాడుతూ రైతులు సమైఖ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. ఉపాధ్యక్షులు మేడిది జాన్ రాజు మాట్లాడుతూ ఇప్పటికే సంఘంలో వెయ్యి మంది సభ్యులు ఉన్నారని, పాలకొల్లు, నరసాపురం, ఆచంట మండలాలకు చెందిన మరో 4 వేల మంది సభ్యులు చేరాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో మేకా ఫణీంద్ర పాల్గొన్నారు.

కొత్తపల్లి రహదారిని నిర్మించాలి

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో కొత్తపల్లి రహదారిని వెంటనే నిర్మించాలని తహశీల్దార్ పి.లక్ష్మి తెలిపారు. బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో నెల రోజులుగా జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం జయప్రదం అయ్యిందన్నారు. కొత్తపల్లిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి వెళ్లడానికి కొత్తపల్లి రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో ఇబ్బందులు పడ్డామన్నారు. వెంటనే రోడ్డు నిర్మించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఎఒ ప్రసాద్ మాట్లాడుతూ వర్షాల వల్ల 232 ఎకరాలు మునిగిపోయాయన్నారు. రైతులు ఇ-పంట నమోదు, ఇకెవైసి చేసుకోవాలని చెప్పారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కె.హరినాథ్ రాజు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో జనజీవని పనులు జరుగుతున్నట్లు చెప్పారు. పనుల నిమిత్తం రూ.3.50 కోట్లు మంజూరయ్యాయన్నారు. జెఇ శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదు గ్రామాల్లో పూర్తయిన ఆర్‌బికెలను ఆగస్టు 15న ప్రారంభిస్తామని తెలిపారు. ఎంఇఒ పి.శేషు మాట్లాడుతూ అమ్మఒడి మండలంలో 4,981 మందికి అందించినట్లు చెప్పారు. ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి మాట్లాడుతూ15వ ఆర్థిక సంఘం రూ.37 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ తులసి మాట్లాడారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి పి.సత్యనారాయణ, సూర్యబలిజ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, మండల ఉపాధ్యక్షురాలు సలాది రత్నదుర్గాకుమారి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి వెంకటరామరాజు

పంటః పొలాలను పరిశీలిస్తున్న ఎఇఒ

1300 ఎకరాలు నీట మునక

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు సుమారు 3,300 ఎకరాల్లో నాట్లు వేయగా, వాటిలో సుమారు 1300 ఎకరాలు నీట మునిగినట్లు మండల ఎఇఒ బి.నాగరాజు తెలిపారు. మరో 800 ఎకరాలకు సరిపడా ఆకుమడులు ముంపునకు గురైనట్లు తెలిపారు. ఆచంట, కొడమంచిలి, కోడేరు, పెనుమంచిలి, వల్లూరు, శేషమ్మచెరువు, తదితర గ్రామాల్లో నాట్లు ముంపుబారిన పడ్డాయి. ఈ నేపథ్యంలో సార్వాసాగుకు ఆదిలోనే హంసపాదు ఎదురుకావడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. భారీ వర్షాలకు మండలంలోని నక్కల, తాడేరు, కొటాలపర్రు ప్రధాన పొంగి పొర్లుతున్నాయి.

అత్తిలి : రైతులు వరిచేల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం మంచిలి, కంచుమర్రు గ్రామాల్లోని నారుమడులను వ్యవసాయాధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా నిన్నటి నుంచి కురిసిన అధిక వర్షాలకు నారుమడులు, నాట్లు వేసిన పొలాల పరిస్థితిపై సంబంధిత వివరాలు ఎఒ టికె.రాజేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పంట పరిస్థితిపై ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కంచుమర్రు విఎఎ కృష్ణ, మంచిలి విఎఎ చంద్రిక, ఈడూరు విఎఎ రాము పాల్గొన్నారు.

నేరాలు.. ఘోరాలు..

బాలుడు అదృశ్యం

ఆకివీడు: ఆకివీడులోని గంగానమ్మ వీధిలో ఉంటున్న బాలుడు మేకల ఆనంద్ (16) అదృశ్యమైనట్లు అతని సోదరుడు మేకల వెంకటేశ్వరరావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కథనం ప్రకారం. చింతలపూడిలో ఉన్న వాళ్ల ఇంటి అద్దె వసూలు చేసుకోస్తానని చెప్పి ఈ నెల 24వ తేదీ సోమవారం ఉదయం ఇంటి నుంచి ఆనంద్ బయలుదేరి వెళ్లాడు. 26వ తేదీ బుధవారం వరకూ రాలేదు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో సందేహంతో పోలీసులకు అతని సోదరుడు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎఎస్ఐ కె.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంగన్వాడీకి వేధింపులపై కేసు

ప్రజాశక్తి - ఆచంట

అంగన్‌వాడీ కార్యకర్తను తరచూ వేధింపులకు గురిచేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా విలేకరిపై ఆచంట పోలీస్ స్టేషన్లో బుధవారం కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కరుగోరుమిల్లి పంచాయతీ పరిధి కోడ్ నంబర్-122లో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న తనను ఆచంట వేమవరం గ్రామానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా విలేఖరి జక్కంశెట్టి శ్రీనివాసరావు నాలుగేళ్ల నుంచి వేధింపులకు గురిచేస్తున్నాడని ఆచంట పోలీస్ స్టేషన్‌లో కమల ఫిర్యాదు చేసింది. ఆ విలేకరి తరచూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి చిన్నారులకు సరిగ్గా పౌష్టికాహారం అందించడం లేదని, సమయానికి సెంటర్‌కు రావడం లేదని, తనపై చెడుగా మాట్లాడుతున్నాడని తెలిపింది. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని బెదిరిస్తున్నాడని వాపోయింది. రూ.50 వేలు లంచం ఇవ్వాలని, డబ్బులు ఇవ్వకపోతే తన గురించి తప్పుగా ప్రచారం చేస్తానంటూ వేధిస్తున్నాడని తెలిపింది. మనస్పర్థల కారణంగా భర్తతో విడిపోయానని, తనకు ఇద్దరు పిల్లలని, జీతంతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నానని తెలిపింది. తనపై నిందలు మోపుతూ నోటికొచ్చినట్లు మాట్లాడుతూ వేధిస్తున్నాడని వాపోయింది. అతని వల్ల తనకు ప్రాణహాని ఉందని పోలీసులు రక్షణ కల్పించాలని ఆమె కోరింది. ఆమె ఫిర్యాదు మేరకు విలేకరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ తెలిపారు.

బాలిక కిడ్నాప్‌కు యత్నం

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - ఉండి

బాలికను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించిన యువకుడిపై ఉండి పోలీసులు బుధవారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారానికి చెందిన మైనర్ బాలికను ఉండి గౌడ పేటకు చెందిన యువకుడు వెన్నంటి సురేష్ యువకుడు ప్రేమిస్తున్నానంటూ కొంతకాలంగా వేధిస్తున్నాడు. అయితే బాలిక తరపు వారు గతంలోనే సురేష్‌పై ఉండి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి రెండు గంటల సమయంలో బాలికను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించగా బాలిక కేకలు వేసింది. దీంతో సురేష్ అక్కడ నుంచి పారిపోయాడని బాలిక మేనమామ దుర్గా హర్షవర్ధన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. సురేష్‌పై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ గంగాధర్‌రావు తెలిపారు.

తాడేపల్లిగూడెం : అమరులైన సైనికునికి నివాళులర్పిస్తున్న సభ్యులు

సైనికుల త్యాగాలు ఎనలేనివి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల త్యాగం వృథా కాదని, సైనికులకు జాతి నివాళులర్పిస్తోందని లయన్ గట్టిం మాణిక్యాలరావు, జోన్ ఛైర్ పర్సన్ పేరిచెర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. బుధవారం టిబిఆర్ సైనిక స్కూల్‌లో లయన్ టి.బోగేశ్వరరావు ఏర్పాటు చేసిన కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు పాల్గొని సైనికులకు నివాళులర్పించారు. విశ్రాంత సైనిక అధికారి, టిబిఆర్ సంస్థ అధిపతి బోగేశ్వరరావు మాట్లాడారు. అనంతరం విశ్రాంత సైనిక అధికారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : ఘనంగా కార్గిల్ విజయోత్సవ దినోత్సవాన్ని స్థానిక రైల్వే జంక్షన్ కళ్యాణ మండపంలో జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. రైల్వే ఏడీఎన్ ఏ రామాంజనేయులు మాట్లాడుతూ కార్గిల్ విజయం భారతదేశ చరిత్రలో సువర్ణ అధ్యాయమన్నారు. పి.హేమంత్, లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ నందమూరి రాజేష్, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు.

పాలకొల్లు : పట్టణ పరిధిలోని జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ అధ్యక్షతన కార్గిల్ విజయ్ దివాస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రతి పౌరుడూ జవానుల త్యాగాలను తలుచుకుని పులకించిపోతారని చెప్పారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.త్రిమూర్తులు, శశికళ, కరణం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

బాధితునికి ఎంఎల్ఎ చెరుకువాడ పరామర్శ

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట వేమవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు గెద్దాడ మంగారావు ఇటీవల పాముకాటుకు గురి కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం కింగ్ జార్జ్ హాస్పటల్లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు బుధవారం విశాఖపట్నం వెళ్లి మంగారావును పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని ఆయన వైద్యులకు సూచించారు.

నేడు ఎస్ఎన్ఎం కళాశాలకు నాక్ బృందం రాక

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 27, 28 తేదీల్లో పాలకొల్లు ఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాక్ టీం సందర్శిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ కళాశాలకు 2006లో బిం, 2014లో బి కేటగిరీ వచ్చిందని చెప్పారు. కళాశాలలో అన్ని తరగతులనూ ఆధునికీరించామని, బోధనా పద్ధతులు, పరిశోధనా ఫ్యాకల్టీ పెంచామని చెప్పారు. ఈ సౌకర్యాలు నాక్ టీం పరిశీలించి ఎ కేటగిరీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాక్ గ్రేడ్ రావడం వల్ల కళాశాల విద్యార్థులకు మంచి కంపెనీల్లో ఉద్యోగాలు వస్తాయన్నారు.

కోటయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రముఖ జాతీయోద్యమ నాయకుడు, చేనేత పరిరక్షణ పోరాడిన యోధుడు ప్రగడ కోటయ్య అని జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర యువజన అధ్యక్షుడు ఈనాడు సూర్యభాస్కర్ రావు అన్నారు. బుధవారం కోటయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యభాస్కర్ మాట్లాడారు. కోటయ్య రెండు సార్లు ఎంఎల్ఎగా పనిచేశారని తెలిపారు. మరణించే వరకూ రాజ్యసభ సభ్యులుగా ఉన్నారని చెప్పారు. ప్రగడ కోటయ్య అంటే చేనేతకు చిరునామా అని తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, కె.పి.పాలెం సౌత్ పంచాయతి పరిధి చామకూరి వారి మెరకు చెందిన ఒడుగు ముత్యాలమ్మ, భర్త: బాలాజీ (లేటు) అను నేను గ్రామం నుండి నరసాపురం వ్యక్తిగత పనుల నిమిత్తం వెళుతుండగా నరసాపురం టౌన్‌లో **R9343750** గల నా పాస్‌పోర్టు పడిపోయినది. ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు తెలియజేయగలరు.

అడ్రసు: ఒడుగు ముత్యాలమ్మ
భర్త: బాలాజి (లేటు), కె.పి.పాలెం సౌత్
చామకూరివారి మెరక, జానకిరామ్ కాలనీ,
మొగల్తూరు మండలం, ప॥గో॥జిల్లా
సెల్: 8500575313

TC, Mark list పోయినవి

ఏలూరు జిల్లా, నూజివీడు మండలం, నూజివీడు గ్రామం, అజరయ్యాపేట, డో.నెం. 2-180 కాపురస్తులు తాణంకి శ్యాంబాబు, S/o. టి.దావీదు అను మా ఇల్లు 9-11-2008 Short Circuit అయి కాలిపోయినది. మా ఇంటిలో సామాన్లుతో పాటు నా సర్టిఫికెట్స్ కూడా కాలిపోయినవి. కావున నా 10th Class Marklist మరియు 10th Class TC ఇప్పించవలసినదిగా కోరుచున్నాను.

T.SYAM BABU
S/o. T.Daveedu
Azariahpet, Nuzvid, Eluru Dist.,
Andhra Pradesh,
Cell: 6304769830